# జీవిత సత్యం

"అబ్బబ్బ ఎంత ఉక్కగా ఉంది? పిక్నిక్కేమోగానీ ఇదో శిక్షలా ఉంది."

" పెందరాలే బయలుదేరుదామంటే వేకువఝామున లేవడం అలవాటు లేదాయే. బారెడు పొద్దెక్కాక, మే నెలలో, ఉక్కగా ఉండకపోతే చలిగా ఉంటుందా?" ఎండకు తోడుగా ఓ చురక అంటించాను.

"ఎ.సి. కారు మాట్లాడితే పోయేది కదా" మా ఉమేశ్ తక్కువ తినలేదు.

"ఉండ చోటిస్తే పండ మంచమడిగాడట నీలాటివాడు. ఎస్.టి. బస్సులో, రద్దీతో గోలగోలగా ఉంటుంది. ప్రైవసీ ఉండదు, అని కారు అమరిస్తే నీకు ఇంకా ఎ.సి. కావాల్సొచ్చింది."

"పోనీండీ. ఏదో కుర్రతనం. మనం ట్రైన్‌లో ఎప్పుడూ ఎ.సి.లో వెళతాం. ఇప్పుడు కూడా అలాగే అనుకున్నాడు పాపం." మా ఆవిడ మామూలుగానే సుపుత్రుణ్ణి వెనకేసుకొచ్చింది.

హోం మినిష్టరు జోక్యం నా నోటికి తాళం వేసింది.

మా వాడి ఇంటర్మీడియట్ ఏమోగాని, రెండు సంవత్సరాల నుండి ఎక్కడికీ వెళ్ళలేదు. ఉమేశ్ పరీక్షలై, సుమ ఎనిమిదో తరగతి ఫలితాలు రాగానే ఈ మహాబలేశ్వర్ ప్రోగ్రాం వేశాను. రొటీన్‌తో విసుగెత్తిపోయింది మరి!

ఆ హిల్ స్టేషన్‌పై ప్రకృతి మాత ఒడిలో సేద తీర్చుకుంటే కాస్త ఫ్రెష్‌గా ఉంటుంది. దట్టంగా పెరిగిన చెట్లు, పచ్చచీర చుట్టుకున్నట్టుగా ఉన్న లోయలు నయనానందకరంగా ఉంటాయి. ఒక్కో కోణం నుంచి ఒక్కో అందాన్ని చిందిస్తాయి.

అక్కడి సూర్యాస్తమయం దృశ్యం చూడాల్సిందే, తప్ప వర్ణించ నలవి కాదు. ఇంత ఎండాకాలంలో కూడా మృదువుగా స్పృశించే చల్లని మలయమారుతం మనసునాహ్లాద పరుస్తూ ఏదో లోకంలోకి తీసుకెళ్తుంది. అప్పుడు మా వాడికి ఎ.సి. పేరు కూడా ఉచ్చరించడానికి ఉండదు.

నా చిన్న తనం జ్ఞాపకం వచ్చింది. మా నాన్నగారెప్పుడూ ఇలా విహారయాత్రకు తీసుకుపోయింది లేదు. ఫ్యాక్టరీలో పని. నాలా ఎల్.టి.సి. ఉండేది కాదు మరి!

ఓసారి నేను స్కూలు ఫైనల్ పాసైంతర్వాత షిర్డీ వెళ్ళాం. దాదర్లో ట్రైన్ ఎక్కి మన్మాడ్‌లో దిగాం. అక్కడి నుండి బస్సులో షిర్డీ వెళ్ళాం. రైల్లోగానీ, బస్సులోగానీ రిజర్వేషన్ ప్రసక్తే లేదు. దానికయ్యే అల్ప ఖర్చు కూడా భారంగా ఉన్న రోజులవి! మా పిల్లలకిప్పుడు ఎ.సి. కావాలి!

"ఏమండీ ఇక్కడ లంచ్ చేద్దాం, అంటున్నారు పిల్లలు" వాణి అరుపు నన్ను వర్తమానంలోకి తెచ్చింది. కారు ఓ మాంచి హోటల్ ముందు ఆగింది. అందరం దిగాము. డ్రైవరు బిల్లు, మా బిల్లులో కలుపమని కౌంటర్‌లో చెప్పి, ఎ.సి. డైనింగ్ హాల్లోకి నడిచాము. మా ఆవిడ దక్షిణాది, పిల్లలు చైనీస్, నేనేమో పంజాబీ... అలా ఎవరి అభిరుచికి తగ్గ ఐటెమ్స్ ఆర్డరు చేసి, మంద్రంగా వస్తున్న పంకజ్ ఉధాస్ గజల్స్ వింటూ కూర్చున్నాము. మా ఉమేశ్ బాబా సెహగల్ ఫ్యాన్. ర్యాప్‌సాంగ్ పెట్టించమని గోల. అంతలో సూప్ వచ్చింది. మా దృష్టి మారింది. చేతికీ, నోటికీ పని కలిగింది. మిగతా దినుసులు రాగానే వాటిమీద పడ్డాం.

వెజ్ మంచూరియన్ నోట్లో వేసుకున్నాడో లేదో "అబ్బ" అని అరిచాడు మావాడు. కారం ఎక్కువయిందని ఫిర్యాదు. నేను రుచి చూశాను. మరీ కారంగా లేదు. దానికే అంతగా అరవవలసిన పని లేదు.

నాకు మళ్ళీ పాత రోజులు జ్ఞాపకం వచ్చాయి. మా నాన్నగారి హయాంలో ఎప్పుడూ ఇలా హోటల్లో భోజనం చేసింది లేదు. ఏ యాత్రకు వెళ్ళినా ఇంట్లోవి వంటకాలు తీసుకెళ్ళే వాళ్ళం. తిరుపతి లాంటి చోట్లో వంట చేసుకునేవారము. ఇప్పుడలా చేద్దామంటే పిల్లలేమో కానీ వాణి పడనివ్వదు.

'హాయిగా తిరగడానికి వెళ్ళినచోట వంటావార్పు ఏమిటండీ? కొంత డబ్బు మనది కాదనుకుంటే ఇష్టమైంది దొరుకుతుంది' అని కామెంట్.

ఇష్టమైంది దొరుకుతుంది. కానీ అది మన టేస్ట్‌కు తగ్గట్టు ఉంటుందని గ్యారంటీ ఏమిటి? లేకపోయినా సర్దుకు పోతుందా అంటే అదేం లేదు. హోటల్ వాళ్ళతో గొడవ పెట్టుకుని ఓ సీను క్రియేట్ చేస్తుంది.

"ఏమండీ" నన్ను కదుపుతూ అంది శ్రీమతి. "పాపం అబ్బాయి ఇష్టపడి వెజిటేరియన్ మంచూరియన్ తెప్పించుకుంటే ఇంత ఘోరంగా ఉంది. నోరంతా పాడైపోయింది. అమెరికన్ చాప్సీ తెప్పించండి. దీనికి డబ్బులు కట్టం అని చెప్పండి."

"బిల్లు సంగతి నీకెందుకు గానీ, నీకిష్టమైంది ఆర్డరివ్వడానికి నేనెందుకూ మధ్యన?"

"బ్యాంకులో ఛీఫ్ మేనేజర్‌గా ఉన్నారు. సర్వర్‌ను ఆ మాత్రం దబాయించలేరూ?"

అందరికీ వినబడేలా అని, తినడంలో పడింది వాణీ. పేరుకు తగ్గట్టే ఉంది ఆవిడ 'వాణి'. 'ఆకాశ' చేర్చడమే తక్కువ!

మహాబలేశ్వర్ చేరేసరికి సాయంత్రం ఆరయింది. బుక్ చేసిన 'రిసార్ట్'లోని మాకు

కేటాయించిన అపార్ట్‌మెంట్‌లో అడుగుపెట్టగానే మా ప్రయాణ బడలిక మాయమైంది. హాలూ, బెడ్‌రూం, వంటగది, బాత్‌రూం, అన్నీ చక్కగా ఫర్నిష్ చేశారు. మనసారా 'వేడినీళ్ళతో స్నానం చేసి' టీ, ఫలహారాలు తీసుకుని వ్యాహ్యాళికి బయలుదేరాం. మరుసటి రోజు సైట్ సీయింగ్‌కని గుర్రాలు కుదుర్చుకున్నాం. మా సుమ, తనకు చిన్న గుర్రం కావాలంటే అదీ మాట్లాడాను. ఛాట్ సెంటర్లో పావ్‌భాజీతో రాత్రి భోజనం అయ్యిందనిపించాము.

మర్నాడు పొద్దున్నే ఆరుగంటలకు లేచి స్విమ్మింగ్‌పూల్‌లో దిగాను. అక్కడ ఈతకొడ్తూ ఉంటే మా ఊళ్ళోని చెరువు జ్ఞప్తికి వచ్చింది. సెలవులకు ఊరెళ్ళినప్పుడు నాతోడి వారితో అక్కడ బంతాట ఆడిన దృశ్యం కళ్ళ ముందుకు వచ్చింది. నేను ఈత నేర్చుకున్నది ఆ చెరువులోనే. అప్పటి నా స్నేహితులు, వారితో కలిసి మామిడికాయలు కొరకు రాళ్ళు కొట్టడం, పాలేరు చూడగానే పారిపోవడం, అన్నీ మధురస్మృతులే.

ఏడు గంటలకు పిల్లలు కూడా వచ్చారు. ఉమేశ్‌కు ఈత వచ్చు, కానీ సుమకు రాదు. అయినా స్విమ్మింగ్‌పూల్‌లో మోకాలు బంటి నీళ్ళలో ఆడుతూ కేరింతలు కొట్టింది. మా ఆవిడ మాత్రం ఒడ్డునే ఈజీ చెయిర్లో కూర్చొని మా జల క్రీడలు తిలకించింది. బహుశా మాకంటే ఎక్కువ ఆనందాన్ని పొందిందేమో!

మూడు రోజులు మూడు నిమిషాల్లా గడిచాయి. ముంబయిలోని మా ఇల్లూ, ఆఫీసు, చుట్టుపక్కల వారూ ఎవరూ జ్ఞాపకం రాలేదు. రిసార్టులోని వ్యాయామశాల, స్నోబాత్, టెన్నిస్ కోర్టు, స్విమ్మింగ్‌పూల్, జాగింగ్ ట్రాక్, టీ.వీ. హాలు అన్నీ వాడాము. అదో లోకంలో విహరించాము. సైట్ సీయింగ్ ఆస్వాదించాము. మనసుకెంతో హాయి కల్గింది.

తిరుగు ప్రయాణం మొదలు పెట్టగానే ప్రాణం ఉసూరుమంది. స్వర్గం నుంచి మానవలోకంలోకి విసిరేయబడుతున్న భ్రాంతి కల్గింది. ఇంకొన్ని రోజులు అక్కడే ఉండాలనిపించింది.

ఆఫీసు వ్యవహారాలు, కాబోయే మీటింగులు, చేయవలసిన పనులు మనసును నొక్కిపట్టాయి. కాళ్లను భూమ్మీద ఆనించాయి. అమాంతం మర్త్య లోకంలో పడకుండా, 'పాంచ్‌గనీ' అనే నందన వనంలో ఓ రోజు విహరించి, ముంబయి దారి పట్టాము.

మర్నాడు? షరా మామూలే. అదే ఇల్లు, అదే ఆఫీసు. లంచ్ టైంలో గోఖలే కలిసాడు. తను డిప్యూటీ జనరల్ మానేజర్. ఖార్ రోడ్డులోని, మా కాలనీలోనే ఉంటాడు. మా కొరకు మహాబలేశ్వర్‌లో రిసార్టు అమర్చింది అతనే.

"మిష్టర్ హరనాథ్! ఎలా గడిచింది మీ వెకేషన్?"

"మెనీ మెనీ థ్యాంక్స్ మిష్టర్ గోఖలే. మీ ఛాయిస్ సింప్లీ సూపర్బ్. ఆ లోకేషన్, ఆ వసతులు, సదుపాయాలు, వారి సర్వీసు అన్నీ ఎక్సలెంట్. మా కుటుంబం తరపున మీకు మళ్ళీ ఒకసారి ధన్యవాదాలు" మనఃపూర్వకంగా అన్నాను:

"ఉట్టి థ్యాంక్స్‌తో సరిపెట్టకండి. సాయంత్రం డ్రింక్స్ కావాలి."

"దానికేం భాగ్యం. సాయంత్రం బోంబే జిమ్ ఖానా వెళదాం, సరేనా"

"డన్", గోఖలే తన సమ్మతి తెలియజేశాడు.

బాంబే జిమ్ ఖానా లాంజ్! సాయంత్రం ఏడుగంటలు. బడా వ్యక్తులు వస్తూనే ఉన్నారు. అంతా కోలాహలంగా ఉంది. కేన్ కుర్చీల్లో కూర్చున్నాం నేనూ, గోఖలే.

తను "డిప్లమాట్ విస్కీ" అంటే, నేను "హేవర్డ్స్" బీర్ అన్నాను. వెయిటర్ సలాం చేసి వెళ్లాడు.

నాకు తాగటం అంత ఇష్టం ఉండదు. ఎప్పుడో గోఖలేలాంటి మిత్రులకు కంపెనీ ఇస్తాను, బీర్ తాగుతూ!

"మహాబలేశ్వర్ బాగా ఎంజాయ్ చేశారన్నమాట."

"తిరిగి రాబుద్ధి కాలేదంటే నమ్మండి. నిజంగా మహాబలేశ్వర్ మనకు దగ్గరలో అందుబాటులో ఉన్న మంచి హిల్ స్టేషన్."

నంజుకునే సామాగ్రి తెచ్చాడు వెయిటర్.

ఆ తర్వాత డ్రింక్స్, గ్లాసులు సర్దాడు. చీర్స్ చెప్పుకుని, బాతాఖానీలో పడ్డాము.

"హోటల్లోలా డబుల్ రూం కాకుండా, అపార్ట్‌మెంట్ పద్ధతిలో ఉన్న బ్లాక్స్, అయిదు నక్షత్రాల హోటల్ స్థాయి వసతులు ఆ రిసార్టుకు వన్నె తెచ్చాయి" నేను బదులిచ్చాను.

"అందుకే ఈ రోజుల్లో అలాంటి రిసార్టులకు గిరాకీ పెరుగుతోంది. పిల్లలకు బాగా నచ్చిందనుకుంటాను."

"బాగానే నచ్చింది. వాళ్ళు చాలా ఎంజాయ్ చేశారు. కానీ వారి విషయంలో నాకు దిగులు పట్టుకుంది. ముఖ్యంగా మా అబ్బాయి ఉమేశ్‌పట్ల నాకు ఆందోళనగా ఉంది." మా ప్రయాణంలోని అపశ్రుతులు జ్ఞప్తికి రాగా నా బాధ వ్యక్తం చేశాను.

"ఏం? ఏమైంది? చదువులో బ్రిలియంటే గదా?"

"చదువులో బ్రిలియంటే, కానీ మిగతా విషయాల్లో అంత అవగాహన లేదు. ప్రతి చిన్న విషయానికి తీవ్రంగా స్పందిస్తాడు."

"అది ఈ వయసులో సహజం. వారికి బాధ్యతలేమున్నాయి అని? ఉడుకురక్తం. తమకు అంచనాలకు ఏమాత్రం తేడా జరిగినా అప్‌సెట్టవుతారు. ఈ విషయంలో నీవేం బెంగ పెట్టుకోవద్దు."

"అదికాదు గోఖలే గారు! జీవితం వడ్డించిన విస్తరి మాత్రమే కాదు గదా! ఏదో మన హోదావల్ల, అవసరమైన అన్ని వసతులూ, సదుపాయాలూ, కల్పించే స్థోమత ఉంది. అలా అని, అన్ని వేళలా, అన్ని చోట్లా ఒకే తీరు సౌకర్యాలు ఉండాలంటే ఎలా? అంత అసహనం కూడదు గదా! చిన్న తేడాలకు తట్టుకోలేక పోతే ముమ్ముందు కష్టంకాదూ? అయినా చిన్నప్పుడు మనం పడ్డ పాట్లు వీళ్ళు పడుతున్నారా?"

"మన పరిస్థితులు వేరు. మన పెంపక నేపథ్యం వేరు. ఆ కష్టాలు మన పిల్లలు పడకూడదనేగా మన తాపత్రయం! మన తల్లిదండ్రులు మన తాహతుకు మించి చేసిన త్యాగఫలమే ఈనాటి మన ఉన్నత స్థితికి కారణం. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలకు తమకంటే మంచి జీవితం ఇవ్వాలనుకుంటారు. తాము కష్టపడ్డా, తమ సంతానం సుఖపడాలని కోరుకుంటారు. వారి జీవనస్థాయి, తమకంటే ఉన్నతంగా ఉండాలని ఆశిస్తారు. అది సహజం."

"నేననేది అది కాదు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం కదా! అలాంటప్పుడు కేవలం సుఖాలకే అలవాటు పడి, చిన్నచిన్న ఆటుపోట్లకు విపరీతంగా స్పందిస్తే ఎలా? నా ఉద్దేశంలో మన పిల్లలను మరీ సురక్షితంగా పెంచుతున్నామనిపిస్తుంది. గారాభం ఎక్కువ చేస్తున్నామేమో!"

"దాంట్లో తప్పు లేదు, కానీ కష్టపడకున్నా కష్టంలోని లోతుపాతులు తెలుసుకోవాలి. జీవిత నాణేనికి సుఖం బొమ్మైతే, బొరుసు కష్టం అనే అవగాహన ఉండాలి. నాణేన్ని ఎగురవేసిన ప్రతిసారీ బొమ్మ పడకపోవచ్చు. బొరుసును కూడా తట్టుకునే స్థయిర్యం మన పిల్లలకు కలిగించాలి. అలా అని వారిని తిప్పలకు గురి చేయాల్సిన అవసరం లేదు. కాయకష్టం చేసుకు బతికే వారి జీవితాన్ని దగ్గరి నుంచి చూపిస్తే చాలు." గోఖలే తన మొదటి పెగ్ పూర్తి చేసి రెండో పెగ్‌కు ఆర్డరిచ్చాడు. నా గ్లాసు నింపి బీర్ బాటిల్ ఖాళీ చేసాను. పాపడ్ నోట్లో వేసుకున్నాను.

"అలా అన్నారు బావుంది. ఈ మధ్య మానేజ్‌మెంట్ కాలేజీల్లో స్లమ్స్‌లో ఉండేవారి జీవితం, వారి సమస్యలను కేస్ స్టడీస్‌కి ఇస్తున్నారు. తమ విశ్లేషణతో, వారి జీవితం సుగమం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. పరేల్, వర్లిలో మాకు దూరపు బంధువులు బీడీ కార్మికులు, మిల్లు కార్మికులు, చిన్నా చితకా పని చేసే వారున్నారు. సెలవు రోజుల్లో ఒక్కో ఏరియాకు పిల్లలతో వెళ్తాము. చుట్టపు చూపుతో పాటు పిల్లలకు ఎడ్యుకేషనల్ టూర్ అవుతుంది. కార్మికుల శ్రమ, వారి పిల్లలు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా పని చేయడం గమనిస్తే మా పిల్లలకు లోకం పట్ల అవగాహన కల్గుతుంది. అందరి జీవితం పూలపాన్పు కాదని తెలుస్తుంది. ఈ విషయంలో వదిన గారి సలహా, సహకారం అవసరం."

"మీకు మా శ్రీమతి గురించి తెలిసినట్లు లేదు. మా పిల్లల గారాబానికి మూల కారణం ఆవిడగారే. నా హోదాను పణంగా పెట్టి సాటివారితో పోటీ పడుతుంది. ఇంటిలోని వస్తువులు, బట్టలు, కాస్మెటిక్స్ అన్ని ఖరీదైనవే. అన్నీ విచ్చలవిడిగా కొంటుంది. అదే పిల్లలకు అలవాటైంది. నేను అడ్డు పడితే 'పీనాసి' అనే ముద్ర వేస్తుంది"- బీరు పని చేస్తుంది. నా ఆక్రోశం బయటకు వచ్చింది.

"తాహతున్నదని ఖర్చు చేయాలని లేదు. ఆ ఖర్చు అవసరమా? సక్రమమా అని కూడా ఆలోచించాలి. సౌకర్యం కొరకు కాకుండా, కేవలం హోదా గుప్పించడానికి చేసే

ఖర్చు సక్రమం కాదు. అది అనర్థాలకు దారి తీస్తుంది. దుబారా ఎప్పుడూ వాంఛనీయం కాదు. ఉదాహరణకు కోచింగ్ క్లాసెస్‌ను తీస్కోండి. స్టేటస్ కొరకు తెలివైన పిల్లలను కూడా క్లాసెస్‌కు పంపుతారు. మా పిల్లలకు ట్యూషన్ పెట్టిందీ లేదు. నేను, మా ఆవిడ పిల్లలకు గైడ్ చేశాం. మీకు తెలుసుగా మెరిట్‌లో వచ్చారు. అమ్మాయి మెడిసిన్, అబ్బాయి ఇంజనీరింగు చేస్తున్నారు."

"మన రోజుల్లో ఏ కోచింగ్ తీసుకున్నాం? మంచి మార్కులు తెచ్చుకోలేదూ? ఇలా అంటే మా ఆవిడేమంటుందో తెలుసా? 'మీ తరానికి, ఈ తరానికి చాలా తేడా ఉంది. ఆ రోజుల్లో ఇంత పోటీ ఎక్కడిది? ఇప్పుడు ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరాలంటే లక్షలకు లక్షలు డొనేషన్లన్నా కట్టాలి, 90 శాతంకు పైగా మార్కులన్నా తేవాలి. ఎంత తెలివిగల వారైనా కోచింగ్ క్లాసెస్‌కు వెళితేగానీ కావాల్సిన మార్కులు తెచ్చుకోలేరు' అంటుంది."

"వదినగారి మాటలు కొంతవరకు నిజమే. తల్లి మనసు మరి! ఆడవారికి పోటీతత్వం సహజం. ఏ విషయంలోనూ తమ పిల్లలు, ఎవరికీ తీసిపోకుండా ఉండాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. భర్తతో పోరి అయినా పిల్లల కోరికే తీరుస్తుంది." గోఖలే కూడా మా ఆవిడనే సమర్థించాడు.

నేను ఓడిపోదలచుకోలేదు.

"ఇది జీవిత దృక్పథానికి సంబంధించిన సమస్య. స్పూన్ ఫీడింగ్‌కి అలవాటు పడితే డిగ్నిటీ ఆఫ్ లేబర్ విలువ తెలియదు. కష్టపడితేగాని సుఖం రుచి తెలియదు. ప్రతీదీ గ్రాంటెడ్‌గా తీసుకోవద్దనే నేననేది. దీంట్లో తరాల అంతరాల ప్రశ్నగాని, పోటీ యుగం అనే మాటకుగాని తావేలేదు." నా బీరు పూర్తయింది.

"ఇది పూర్తయ్యే పురాణం కాదు. నలుగురితోపాటు నారాయణ అనాలి. తొమ్మిదౌతోంది. బయలుదేరుదామా?" బాటమ్స్ ఆప్ చేస్తూ అన్నాడు గోఖలే.

బిల్ తెమ్మని వెయిటర్‌కి సైగ చేశాను.

కారును మెరిన్ డ్రైవ్ మీదుగా తీసుకెళ్తున్నాడు గోఖలే. నేను కళ్ళు మూసుకున్నాను. నా చిన్నప్పటి పరిస్థితులు, ఇప్పటి మా జీవన విధానం సినిమా రీళ్లలా తిరుగుతున్నాయి. "బొమ్మా, బొరుసు" - గోఖలే మాటలు చెవిలో గింగురుమంటున్నాయి. ఈ జీవిత సత్యాన్ని పిల్లలకు ఒంట బట్టించాలి. వారికి సర్దుబాటుతత్వం అలవర్చాలి. అలా అయితేనే వారు ఎదురు దెబ్బలకు తట్టుకోగలుగుతారు. తమ అంచనాలు తప్పినా, తీవ్ర మానసిక సంఘర్షణకు లోను కారు. అప్పుడే వారు జీవిత పోరాటంలో విజేతలుగా నిలబడతారు. నా ప్లాను ఫలిస్తుందా?

ఈ విషయంలో వాణి సహకరిస్తుందా?

ప్రయత్నించాలి. "కర్మణ్యే వాధికారస్తే..."

కారు మా కాలనీలోకి మళ్ళింది. నేను కళ్ళు తెరిచాను! ★